523068801

ఆధునిక విద్య పెరిగెను అంతులేక
ఆత్మవిద్యయు క్షీణించె అవధిలేక
సత్యధర్మంబులన్నియు సమసిపోయె
సంకుచిత హృదయులైరి యీ చదువువలన.
అతిగ భాషించు శూరత్వమధికమయ్యె
కార్యశూరత క్షీణమై కరగిపోయె
బ్రతుకు ఆడంబరాలతో భారమాయె
నేటి విద్యార్థి బ్రతుకు యీపాటిదాయె.

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

ఇది ఆధునిక యుగము. అనంతమైన సాంకేతిక విజ్ఞానము వెల్లివిరిసిన కాలము. కానీ యీ విజ్ఞానము బహిరమైన నాగరికతను మాత్రమే మనకు బోధిస్తూ వుంటున్నాది. ఈనాటి విద్యార్థులకు కావలసినది ఆత్మవిశాలము. ఆత్మపరిపాకము. హృదయ నిర్మలము. ఇదియే అంతరమైన నాగరికతను, సంస్కృతిని మనకు అందిస్తుంది. మేధాశక్తితోపాటు హృదయ నిర్మలత్వమును చేకూర్చుకోవాలి. మానవుని విశాల హృదయులుగా తీర్చిదిద్దటమే విద్యయొక్క పరిపూర్ణత. ఈ విద్యల చేత కలతత్వమును పోషించుకోటమే కాకుండా మెదడుకు తగిన క్రమశిక్షణను అందించేదిగా వుండాలి. అప్పుడే జీవితములో క్రమశిక్షణ మనకు ఏర్పడుతుంది. వినయ, వివేకము లేని విద్య నిరుపయోగమైనది. ఈనాటి ఆధునిక విద్యలన్నియు కేవలము వినయ విధేయతలకు అతిదూరమై వుంటున్నవి. విద్యనిమిత్తమై మనము గుణమును కోల్పోరాదు. గుణసంపత్తిని యినుమడింపచేసుకోటమే విద్యయొక్క ప్రధాన లక్ష్యము. మూర్ఖులైన, నిరక్షరకుక్షుల కంటె విద్యావంతులైన వారివల్లనే లోకము అనేక విధములుగా చెడిపోతూ వుంటున్నాది. కారణము యీ విద్యయందు తగినంత గుణసంపత్తి లేకపోవటమే. గుణమే మానవుని ప్రధానమైన జీవితము.

ఈనాడు విద్యార్థులు భారతీయులుగా జీవించటానికి తగిన కృషి చెయ్యాలి. ఈనాడు విదేశ విజ్ఞాన సంపర్కము చేత భారతీయ చైతన్యమును మనము కోల్పోతున్నాము. ఇది కేవలము కృత్రిమమైన జీవితముగా రూపొం

523068802

డింప చేసుకుంటున్నాము. ఈ నాటి భౌతిక విద్యలు, వైజ్ఞానిక విద్యలు మానవుని పరాధీనము గావిస్తున్నవి. బానిసగా తయారు చేస్తున్నది. మాష్టరు కావలసిన విద్యార్థి యీనాడు సేవకుడిగా తయారౌతున్నాడు. స్వార్థరహితము, వినయము, నిరాడంబరము విద్యయొక్క ప్రధానమైన గుర్తులుగా నిరూపించాలి. భారతీయులయొక్క చైతన్యమనూ నీతి, నిజాయితీ సహజసౌశీల్యముతో కూడిన తత్త్వము. దీనికి నాలుగు విధములైన మార్గములను అనుసరిస్తూ, యీ విద్యాసౌధమునకు నాలుగు స్తంభములుగా నిలబడినవిగా మనము గుర్తించాలి. మొదటిది ఆత్మనిగ్రహము. రెండవది ఆత్మవిశ్వాసము. మూడవది స్వయంకృషి. నాల్గవది స్వార్థరహితము. self control, self confidence, self-support, self sacrifice. యీ నాలుగే విద్యకు ప్రధానమైన స్తంభములు.

ఈ నాటి విద్యార్థులు selfనే మరచిపోతున్నారు యింక కంట్రోలు యెక్కడ, support ఎక్కడ, sacrifice ఎక్కడ. తన తత్త్వమునే తాను విస్మరించి జగత్తును మాత్రము విశ్వసించి, మానవత్వమును కోల్పోయి, దానవత్వముగానో లేక పశుత్వముగానో మాత్రమే తీర్చిదిద్ది నిల్చిపోరాదు. పరిపూర్ణ మానవునిగా తీర్చిదిద్దాలి. ఈ నాడు మనము మరొక మార్గములో దేశమును సంరక్షించటానికి తగిన శక్తి సామర్థ్యములు లేక పోవచ్చును. సత్యమే సరైన శక్తి. సత్యమును మనము కాపాడుకొందుమా జగత్తునే కాపాడినవారమవుతాము. ఈ నాటి మానవుడు లౌకిక విషయములను అనేకముగా తెలుసుకున్నాడు. అనేక విధములైన సిద్ధాంతములను గుర్తించుకుంటూ వచ్చాడు. వైజ్ఞానికముగా అనేక పరిశోధనలు సాగిస్తున్నాడు. కానీ మానవునిగా తాను నిలబెట్టుకొన్న గుణము యేమిటో ఒక్కటైనా చెప్పగలరా? తాను సాధించిన మానవత్వము ఏమిటి? తనయందు మానవతాగుణములు యే రీతిగా వుంటున్నవి. ఎన్నింటిని పోషించుకున్నారు? ఎన్నింటిని ఆదర్శముగా నిరూపిస్తూ వున్నారు? ఈ ప్రశ్నలకు యే విద్వాంసుడు సరైన జవాబు యివ్వటము లేదు. ఈ నాటి వైజ్ఞానిక శాస్త్రమందు వివేకరహితులై, వినయరహితులై, మానవత్వమును విస్మరించి, కేవలము యీడ్ జగత్తును పోషించే లక్ష్యముతో అనేక విధములైన అభివృద్ధులను సలుపుతూ వున్నారు. నిజముగా వివేకమే వుంటుండిన తాను సృష్టించిన యంత్రములన్ని కూడను, bombs అన్నికూడను జగత్తును యే విధముగా నిర్మూలము గావించుచున్నవో అనే విషయమును తాను గుర్తించుకోలేక పోతున్నాడు. ప్రపంచమునే భస్మము గావించే బాంబు నిర్మాణము గావించి దానిని ప్రయోగించటంచేత నిర్మాణము గావించిన వ్యక్తి మాత్రము నిల్చగలడా యీ జగత్తులో. నిర్మాణము గావించిన దేశము మాత్రము క్షేమముగా నిలువగలదా? ఇంత మాత్రము విచారణ లేకుండా, వివేకము

523068803.

లేకుండా యీ యంత్రములు యేరీతిగా సృష్టిస్తూ వస్తున్నారు. విజ్ఞానము పెరిగిందిగాని వివేకము తరిగింది. కనుక వివేకమనేది నిత్యానిత్య విషయ పరిశీలన. అది లేని సమయము లోపల మానవుడు ఎన్ని సృష్టించి ఏమి ప్రయోజనము?

విద్యవలన మానవుడు పరిపూర్ణమైన మానవుడుగా తయారు కావాలి. విద్యార్థులకు చేతినిండుకు పని, హృదయము నిండుకు పవిత్రమైన భావములు నింపాలి. కాని యీనాటి విద్య విషయపరిపాకమును తలకు చేర్చుకుంటూ వస్తున్నది. మానవ నిర్మాణతను గాని, శీల నిర్మాణతకు గాని యీనాటి విద్య యేమాత్రము ప్రోత్సహించుటము లేదు. వినయము లేని విద్య, శీలము లేని జీవితము, విచక్షణ లేని పాండిత్యము, క్రమశిక్షణ లేని సమాజము, కృతజ్ఞత లేని సోదరుడు, చేసిన మేలు మరచే స్నేహితుడు, మాధుర్యము లేని సంగీతము, అర్హత లేని అధికారము, ప్రేక్షకులను సంపూర్తిగా తృప్తి చేయలేని వుపన్యాసములు యీనాడు లోకములో యేమాత్రము రాణించవు. ప్రజామన్ననలను అందుకొనలేదు. వీటన్నింటికి మూల కారణమేమిటి? విద్యార్థికి సంఘదోషము చాలా పటుత్వముగా వుంటున్నది. విద్యార్థులు సరైన స్నేహమును అభివృద్ధిపరచుకోవాలి. ఈ విధమైన స్నేహమును అభివృద్ధి పరచుకొన్నప్పుడే విద్యార్థియొక్క వివేక విజ్ఞానములు కూడను అభివృద్ధి గాంచటానికి ఒక అవకాశము వుంటుంటాది. 'త్యజ దుర్జన సంసర్గమ్' Run away from evil company. ఈ విధముగా చెడ్డవారి సహవాసమును తక్షణమే మనము వదలిపెట్టాలి. చెడ్డవారి వలననే ఉత్తముడైన విద్యార్థి కూడను అధముడుగా మారిపోతున్నాడు. మానవుడుగా వుండినవాడు కూడను దానవుడుగా తయారౌతున్నాడు. ఈ దుస్సంగమనేది మానవుని అనేకవిధములైన దుర్గుణములలో ప్రవేశింప చేస్తుంది. కేవలము వ్యక్తుల యొక్క సహవాసము మాత్రమే కాదు. దుష్టభావములు కూడను మనలో ప్రవేశించకుండా చూడాలి. మనలో చెడ్డ తలంపులు చేరినప్పుడే చెడ్డక్రియలలో మనము ప్రవేశిస్తున్నాము. కనుకనే భావములను కూడను మనలో ప్రవేశించకుండా చూచుకోటం యీ విద్యయొక్క ప్రధానమైన లక్ష్యము. పాము విషపురుగు అని మనము భావిస్తాము. కాదు. కాదు. దుష్టుడే పాముకంటె మహా దుర్మార్గుడు. పాము ఎప్పుడో ఒక పర్యాయము మాత్రమే తమ జోలికి పోయినప్పుడు మాత్రమే కరచటానికి ప్రయత్నిస్తుంది. దుష్టునకు కాల నియమము లేదు. దేశకాల పరిస్థితులకు కూడను అతీతుడై వుంటాడు. ఎట్టి కారణము కూడను తాను కోరడు. పరులను బాధించటము, పరులను హింసించటమే దుష్టుని యొక్క ఆనందము. కనుక అట్టివారి సహవాసము నుంచి మనము దూరముగా వుండాలి.

క్రూరమృగమును దెచ్చి కూర్మితో పెంచిన
ఆకలయ్యేనని అదిమి పట్టు
దుష్టగుణములుండు దుర్జను స్నేహము
క్రూరమృగము కంటె ఘోరమగును.

523068804

కోపమున్న వాని కోరి చేరగవచ్చు
పాము ప్రక్కనైన పండవచ్చు
మత్సరంబుగల మనుజుని స్నేహంబు
చేరనేని వాడు చెడును యిలను.

కనుక మనము సాధ్యమైనంత వరకు త్యజ దుర్జన సంసర్గమ్. భజ సాధు సమాగమమ్. సద్గురువుల యొక్క సంపర్కమును మనము సంపాయించుకోవాలి.

మంచివారి పొందు మహిలోన దొరుకదు
దుష్టు లెందరైన దొరుకుచుందురు
కలికరాళ్లు భువిని కలవు యెన్నైనను
వెలను బోలు వజ్రమొకటి కలదా!

స్మర సజ్జన సంపర్కమ్. సజ్జనుని యొక్క సహవాసమును మనము అమితముగా ఆశించాలి. అట్టివారివలన మనము యెంతైనా వున్నతస్థితి అందుకోటానికి అవకాశము వుంటుంది. నిరుత్సాహములో కృంగిన స్నేహితుని ఉత్సాహపరుస్తాడు. అనేక విధముల శక్తి సామర్థ్యములనిచ్చి అభివృద్ధి గావిస్తాడు. సజ్జనుడనగా ఎవరు? సత్యము, ప్రేమ, సహనము, సానుభూతి యిత్యాది వుత్తమ గుణములతో కూడిన శీలవంతుడే సజ్జనుడు. ఎంతటి వుపకారము పొందినప్పటికిని అట్టివారికే అపకారము తలంచేవాడు మహాదుష్టుడు. చేసిన మేలును మరచేవాడు మహాదుష్టుడు. పరులమంచిని ఆశించలేనివాడు మహా దుష్టుడు. ఉన్నత స్థాయిలో వుత్తమ మార్కులు పొందినవానిని చూచి అసూయపడేవాడు దుష్టుడు. కనుకనే అన్యాయ, అక్రమ, అనాచారములతో తులతూగుతుండేవాడు మహా దుష్టుడు. న్యాయ, సత్య, సహన సౌశీల్యములతో కూడినవాడు సజ్జనుడు. నిరంతరము పరులను దూషించేవాడు పాపి. మనయందున్న దోషములను మనము నిర్మూలము గావించుకొని పవిత్రమైన గుణములను పోషించుకోటానికి ప్రయత్నము చేసేవాడు సజ్జనుడు.

ఎవ్వరిని మనము నిందించరాదు. ఎవ్వరిని మనము బాధించరాదు. కాని యీనాటి యువకులందు కన్నతల్లి తండ్రులనే హింసించే కుమారులు వుంటున్నారు. ఇది సరైన మార్గముకాదు. తినేది వారితిండి. కట్టే బట్ట వారి బట్ట. నివసించే కొంప వారిది. ఏతావాతా నీ blood, నీ food, నీ head parents ఇచ్చిరి. అట్టి తల్లి తండ్రులనే విస్మరించే క్రూరుడు యింకెవరిని విశ్వసించగలడు. అట్టివారి ఆజ్ఞలను తిరస్కరించుటే పుత్రుడే గాదు, పుత్రికే కాదు. ఇది కేవలము విద్యయొక్క వికారమైన చేష్ట. కనుక వికారమును దూరము చేసుకొని ఆకారముగా మనము బ్రతకటానికి ప్రయత్నించాలి. కనుక స్మర సజ్జన సంసర్గమ్. కురు పుణ్యమహోరాత్రమ్. పవిత్రమైన కార్యములలో మనము ప్రవేశించాలి. సేవలందు సమాజ సానుభూతుల లోపల యితరులకు తోడ్పడే కార్యములందు, రోగులను సేవించుట యందు, దీనులను దిక్కులేని వారిని ఆదరించుటయందు మనము తగిన కృషి సల్పాలి. కనుకనే కురు

5230688O5

పుణ్యమహోరాత్రమ్. రాత్రిపగలు అనే విచారణ చేయకుండా ఎప్పుడు అవసరమైతే నీసహాయ
ము ఆసమయమందు నీవు అందించటానికి సంసిద్ధుడవై వుండాలి. ఈ విధమైన పరోపకార
ములందు నీకాయమును అంకితముగావించి నప్పుడే పరోపకారార్థమిదం శరీరమ్, ఈ శరీ
రము సార్థకమవుతుంది. కాని తెలివితేటలు ఈనాడు గొప్పగా పెంచుకుంటున్నారు. అవే గొ
ప్పగుణములుగా భావిస్తున్నారు. కాదు.కాదు. నిజముగా హృదయసంబంధము నుంచి ఉబికి
ఊరిన నిజమైన సత్యభావముతే మనయొక్క సత్యగుణములు. ఆ గుణము ఈనాటి విద్యా
వంతునియందు అతిస్వల్పముగా వుంటున్నది. అలాంటి గుణహీనుడైన వాడు యెంత గొ
ప్పవిద్యలు చదివినప్పటికిని ఈప్రపంచములో రాణించలేడు.

గుణము కొంచెముండి గొప్పచదువుండిన
ఫలమదేమి వాని విలువదేమి
పంట పండని భూమి పదిఎకరములేల
కొంచెమైన చాలు మంచి భూమి.

ఉపయోగము లేని తెలివితేటలు యెన్ని వుండి యేమి ప్రయోజనము? ఎన్ని విద్యలు వుండి ప్ర
యోజనము ఏమిటి? ఆదర్శప్రాయమును అందించే సద్గుణము ఒక్కటుంటే కూడ చాలు.

విద్యార్థులారా! ఈనాడు మనము విద్యకు తగిన వినయ విధేయతలు ప్రక
టించటానికి ప్రయత్నించాలి. కానీ ఈనాటి విద్య కేవలము ఇంద్రియములకు దాసుని గా
వించుచున్నది. కాదు కాదు. ఇంద్రియములను నిగ్రహపరచుకునే విద్యార్థిగా మనము పో
షించుకోవాలి. ఈ విద్యకు ఈనాలుగే మూలస్థంభములు. self control, self satisfacti
on, self sacrifice, self support. ఈ నాల్గింటిని మనము అభివృద్ధి పరచుకొన్నప్పుడు
అదే నిజమైన విద్యను రాణింప చేసేదిగా తయారౌతుంది. విద్యార్థులారా! ఈనాడు మానవుని
యొక్క మనస్సు మహా చంచలమైనది. విద్యార్థులు తప్పనిసరిగా షట్సంపత్తిని అందుకో
టానికి ప్రయత్నించాలి. అవే శమ, దమ, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధాన. మొదట శమ
ము. శమ మనగా ఏమిటి? బహిరింద్రియములను మొట్టమొదట అరికట్టుకొనుటకై
ప్రయత్నించాలి. బహిరింద్రియముల యొక్క ప్రయాణము. మన కన్నులు బయట దృష్టి
నే ఆశిస్తున్నది గాని లోపలి దృష్టిని ఆశించటము లేదు. చెవులు బయటి విషయములనే
శ్రవణము గావించుచున్నది గాని అంతర శబ్దము యేమాత్రము ఆశించటము లేదు.
మన పాదములు బయటప్రపంచమునందే సంచరించుచున్నవిగాని లోప్రదేశములో
యేమాత్రము ప్రయాణము చేయుటం లేదు. ఈ విధముగా బహిర్ముఖమైన ఇంద్రియ
ములు బాహ్యతత్వమును మాత్రము ఆచరిస్తూ, ఆనందిస్తూ, అనుభవిస్తూ వుంటున్నాయి. ఇ
ట్టి బహిర్ముఖములో ప్రయాణము చేసే ఇంద్రియములు అరికట్టుకోటమే శమము.
అయితే దమ మనగా ఏమి? ఇది అంతరింద్రియములకు సంబంధించినది. మనసు, బు
ద్ధి, చిత్తము, అహంకారము. అయితే ఈనాలుగు కూడను మానవునికి కనుపించేవి కాదు.

523068806

కనుకనే వీటిని అంతరింద్రియములని చెప్తూ వచ్చారు. అయితే యీ అంతరింద్రియముల ప్రోత్సాహ ఉత్సాహముల చేతనే బహిరింద్రియములు ప్రకటించుచున్నవి. బహిర్ముఖమైన యింద్రియములలో మనకు యే మాత్రము ప్రమాదము లేదు. అయితే బహిర్ముఖమైన యింద్రియములు అంతర్ముఖమైన యింద్రియముల చేత ప్రోత్సహించబడుతున్నాయి.

ఇది ఎట్లనగా కారుకు నాలుగు టైర్సు వుంటాయి. ముందు లైట్లు వుంటాయి. పెట్రోలు టాంకు వుంటుంది. ఇవన్నీ బయటనే వుంటున్నాయి. అయితే స్టీరింగు మాత్రము లోపల వుంటున్నది. ఈ టైర్సు బయట రోడ్డుపైన నడుచేవి అయినప్పటికిని లోపల స్టీరింగు తిప్పినప్పుడే ఆ టైర్సు తిరుగుతాయి గాని బయట టైర్లు పట్టుకొని తిప్పుతే తిరగవు. మన మైండ్ స్టీరింగు. ఈ మైండ్ అనే అంతరింద్రియము తిరిగినప్పుడే బహిర్ముఖమైన కాళ్లు చేతులు అన్నీ తిరుగుతూ వుంటాయి. లైట్లే మన కన్నులు. ఈ హారన్ను మన చెవులు. Front టైర్సు మన hands. back టైర్సు మన legs. ఇవన్నీ అంతరింద్రియములపైనే ఆధారపడి వున్నాయి. కనుక బహిర్ముఖమైన నోటిని, కంటిని, చెవులను మనము అరికట్టుకొనుట వలన ప్రయోజనము లేదు. నిద్రావస్థలో సహజముగనే అరికడుతున్నాము. మొట్టమొదట మనస్సును కంట్రోలు చేయటానికి ప్రయత్నించాలి. ఈ స్టీరింగు సరైన స్థితిలో వుంటే యీ యింద్రియములు యే మాత్రము పెడమార్గము పట్టవు. ఒక్కొక్క తూరి స్టీరింగు చెడిపోయిందంటే యీ యింద్రియములు యిష్టము వచ్చినట్లు పడిపోతాయి. మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః. కనుక మొట్టమొదట మనస్తత్వమును చక్కగా సర్దించటానికి ప్రయత్నించాలి.

మనసు తలచినట్లుగా మనము అనుసరించరాదు. తదుపరి బుద్ధితో మనము విచారణ సల్పాలి. నీ మనస్సు చెప్పిన విషయము is it right or wrong, is it good or bad అని బుద్ధిలో విచారణ చేయాలి. ఈనాటి విద్యార్థులు బుద్ధివరకు ప్రయాణము చేసే అవకాశము లేదు వారికి పాపం. మనసు తలంచిన తక్షణమే అందులో మూర్ఖముగా ప్రవేశిస్తూ వుంటారు. నేను విద్యార్థిని. నేను విద్యావంతుడిని. నేను చేయతగిన పనియా, నేను చేయతగని పనియా? ఇది నాయొక్క స్థానమునకు గౌరవమా? అగౌరవమా? ఈ సమాజములో వుండిన పౌరులకంతా నేను ఆదర్శవంతమైన వాడిగా నిరూపించాలి. అలాంటి వాడను నేను ఒక విధమైన చెడ్డ మార్గమును ప్రవేశించరాదు. సరైన ఆదర్శప్రాయుడుగా జీవించాలి. గుణములు మనము అభివృద్ధిపరచుకోవాలి.

ఇంక తదుపరి ఉపరతి. అనగా మనస్సుయొక్క తత్వాన్ని బహిర్ముఖమైన యింద్రియములలో ప్రయాణము చేయకుండా అంతర్ముఖమైన భావాన్ని కొంతవరకు చింతించాలి. నా చిత్తము పరిశుద్ధముగా వుందా లేదా; నా భావములు సరైనవా కాదా అని తనలో తాను కొంతవరకు విచారణ చేయాలి. తనకు తాను self satisfaction అయిన తరువాత self sacrifice కు మానవము ప్రయత్నము చేయాలి. కాని తనకు self satisfaction కావటంలేదు. అలాంటి సమయములోపల మనము యేరీతిగా బహిర్ముఖములో మన జీవితాన్ని

గడపటానికి వీలవుతుంది. ఉపరతి అనగా మొట్టమొదట తనలో తాను కొంతవరకు సంతృప్తి పరచటానికి ప్రయత్నించాలి. దీనినే conscience అన్నారు. మన conscience కు తృప్తి లేనప్పుడు మన జీవితము యేమాత్రము తృప్తి నొందదు. నిజముగా నీ master అదే. నేను అనేక పర్యాయములు చెప్తు వుంటాను. నాలుగు F లు. మొట్టమొదట follow the master. నీ conscience ను నీవు follow చేయాలి. కానీ నీ conscience కి విరుద్ధముగా నీవు జరుపుతూ నేను యేదో చక్కగా జరుపుతున్నానని ప్రపంచమును మోసగిస్తున్నావు. నీవు తలచటము ఒక్కటి చెప్పటం మరొకటి. చెప్పటం ఒకటి చేయటం మరొకటి. ఇది మానవత్వమునకు విరుద్ధమైనది. The proper study of mankind is man. Thoughts, words, deeds ఈ మూడింటి యొక్క ఏకత్వము కావాలి. నీ హృదయములో వున్నదానిని నీవు సరైన పవిత్రమైన మార్గములో తయారు చేసుకోవాలి. అదే follow the master. నీ conscience ను నీవు సరైన రీతిలో అనుసరించినప్పుడు face the devil. ఈ దుష్టమైన, అపవిత్రమైన అనిత్యమైన, అశుభ్రమైన దీనిని మనము ఎదుర్కోటానికి సంసిద్ధముగా వుండవచ్చు. ఇవి ఎంతవరకు మనము చేయాలి. మనము confidence develop చేసుకొనేంతవరకు వుండాలి. Follow the master. Face the devil. Fight to the end. కడవరకు మనము దీనిలో పోరాటము సలపాలి. అప్పుడే self sacrifice అదే అయిపోతుంది. అదే finish the game. కనుక మొట్టమొదట మన హృదయము సరైన రీతిలో వున్నదా లేదా అని విచారణ సలపటమే ఉపరతి. నీ మంచి చెడ్డలు ఎవరో చెప్పటం కాదు. నీ మంచి చెడ్డలు నీవే నిర్ణయించుకోవాలి. ఏ విధముగా నిర్ణయము చేసుకోవాలి. నీకు తృప్తికరముగా నిర్ణయము చేసుకోవాలి. కాని యీనాడు అట్టి పవిత్రమైన దీనిలో ఎవరు ప్రవేశించటం లేదు.

ఇంక తితిక్ష. రెండింటి యొక్క సమత్వమే తితిక్ష అన్నారు. ఎవరైనా నిందించనీ లేక వర్ణించనీ రెండింటిని సమభావముతో తీసుకోవాలి. ఇది కేవలము శబ్ద తరంగములుగా మనము విశ్వసించాలి. ఒకరు దూషించటము వలన మన మంచి తరిగి పోదు. ఒకరు పొగడటం వల్ల మన మంచి పెరిగిపోదు. ఒక తూరి మంచి మార్కులు తెప్పించుకోవచ్చు. ఫెయిలై పోయానని నిరాశతో నిస్పృహతో కృంగరాదు. ఇవి యేదో నా ఉత్సాహ ప్రోత్సాహములను అభివృద్ధిపరచటానికి వచ్చిన ఫలితములని భావించాలి. కనుకనే The pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యలోనే మనకు సుఖము వుందని విశ్వసించాలి. ఫెయిలై పోయానే అని నిరాశతో కృంగరాదు. దీనికి నేను ఫెయిలయ్యాను. నేను సరిగా చదవలేదు అని దానిని నీవు చక్కగా విచారించాలి. నా ప్రయత్న దోషమేగాని మరొకటి కారణం కాదు. కాని యిక ముందు నేను నా ప్రయత్నాన్ని చక్కగా సాధిస్తాను అనే దీక్షను పట్టాలి. అలాంటి దీనిలో determination చక్కని పట్టుదలను పట్టాలి. ఈ విధముగా వుండినప్పుడే మనము అన్నింటియందు సమత్వమును, ఆనందమును అందుకోగలము. చల్లటి గాలి వస్తుండాది. ఈ చల్లటి గాలిని మనము యెక్కువ కాలము తప్ప

523068808

కొనలేము. ఒక్కొక్క తూరి చాలా వేడిగాడ్పులు వేస్తూ వుంటాయి. వాటిని కూడా మనము సహించుకోలేము. కుండపోత వంటి వర్షము కురుస్తూ వుంటుంది. కానీ దానిని ఎక్కువ కాలము మనము భరించుకోలేము. కొండలు కరిగే చలిగాలి వేస్తుండాది. దానిని కూడను మనము సహించుకోలేము. ఏమి పాడు ఎండలు. ఏమిటి యీ పాడు చలి. ఏమిటి యీ పాడు వాన ఏమాత్రము నాకు విశ్రాంతినివ్వటం లేదు అని మనము దూషిస్తూ వుంటాము. ఇవి ప్రకృతి యొక్క సహజ లక్షణాలు. ప్రకృతి యొక్క నిర్ణీతమైన కాలాన్ని, నిర్ణీతమైన సమయాన్ని దూషించే అధికారము మనకు ఎక్కడుంది. అలాంటి మంచి చెడ్డలను మనము సమముగా చూచుకొనే భావాన్ని మనము పోషించుకోవాలి. ఈ equal mind మానవుని యొక్క సమత్వమనేది విద్యాస్థితి యందే మనము అభివృద్ధి పరచుకోవాలి. అట్లు లేకుండా మన జీవితములో balance తప్పిపోయిందంటే మన జీవితమే ప్రమాదములో మునిగిపోతుంది. ఈ balance ఎప్పుడు తప్పుతుండాది. మన తెలివి తేటలు చాలా పెరిగి పోతున్నాయి. కానీ యీ knowledge ని మనము పోషించుకోటానికి తగిన కృషి చేయకుండా మనము పాడు చేసుకోటానికి తగిన పెడమార్గము పట్టిస్తున్నాము. నీవు knowledge ని skill చేయి. balance చక్కగా వుంటుంది. కానీ నీ knowledge ని kill చేస్తున్నావు. అనగా ఏమిటి misuse చేస్తున్నావు. దుర్మార్గములో ప్రవేశపెడుతున్నావు. కనుకనే యిక్కడ balance తప్పిపోతున్నాది. ఒక నడక కూడను balance పైనే ఆధారపడి వుంటున్నాది. సైకిలు తొక్కటం balance పైనే ఆధారపడి వుంటున్నాది. life ఒక balance. ఈ balance తప్పిపోతే life ప్రమాదములో పడిపోతుంది. కనుకనే knowledge, skill, balance, insight యీ నాల్గింటి యొక్క సమత్వమును మనము పోషించుకోవాలి. ఈ విధమైన దేంట్లో మనము కొంతవరకు ఉపరతి అనే దానినుండి తితిక్షలో ప్రవేశించాలి.

శ్రద్ధ ఐదవది. ఈ శ్రద్ధనే మన జీవితము. శ్రద్ధ లేకపోతే యే చిన్న కార్యము కూడను మనము విజయము సాధించలేము. శ్రద్ధ కలిగిన వానికి యింత నిప్పు యిస్తే దానిని చక్కగా పోషించుకొని పెద్ద నిప్పుగా తయారు చేసుకోవచ్చు. శ్రద్ధ లేని వానికి చాటెడు నిప్పు యిచ్చినా అది ఆరగొట్టుకుంటాడు. కనుకనే శ్రద్ధావాన్ లభతే జ్ఞానమ్. మనము జ్ఞానము సంపాయించుకోవాలంటే శ్రద్ధ వుండాలి. ఆ శ్రద్ధే తపస్సు. ఆ శ్రద్ధనే ఆనందము. ఆ శ్రద్ధనే జ్ఞానము. ఆ శ్రద్ధయే విద్య. కనుక నిజమైన శ్రద్ధ వుంటుండాలి. శ్రద్ధ లేకపోతే మనము ఏమి చేయగలము? బద్ధులమై పోతాము. ఈ బద్ధులనుంచి ఎద్దులుగా మారతాము. ఎద్దుల నుంచి క్రూరత్వములో మునిగిపోతాము. క్రూరత్వము నుండి పశుత్వమునకు దిగజారుతాము. కనుక శ్రద్ధను మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ శ్రద్ధవలన సమయపాలన కాలనిర్ణయము. మొట్టమొదట సమయపాలన. ఈ శ్రద్ధతో పోషించుకోవాలి. కాలేజీ తొమ్మిది గంటలకు. correct గా ఆ సమయానికి రావాలి. ఈనాడు కొంతమంది పెద్దలంతా కూడను సాయంకాలము నాలుగు గంటలకు మీటింగు అంటారు. రాత్రి తొమ్మిది గంటలకు వస్తారు.

523068809

ఈ కాలమునే వీరు adjust చేసుకోపోతే, సమయమును సరిగా పాలన చేయలేకపోతే ప్రపంచమును యేరీతిగా పాలన చేయగలరు. ఎలాంటి పరిస్థితులు అడ్డుతగిలినా గాని సమయానికి అక్కడు పోయి చేరాలి. ఈ సమయపాలన మానవునికి ప్రధానమైనది. ఇది విద్యార్థులకు గాని, ఉపాధ్యాయులకు గాని, ఏ వ్యక్తికైన కూడను, పాలకులకు గాని యీ సమయపాలన అత్యవసరమైనది. ఎన్ని గంటలకు మనము రావాలి. ఎన్నిగంటలకు కాలేజీకి పోవాలి. ఎన్నిగంటలకు స్నానం చేయాలి. ఎన్నిగంటలకు breakfast తీసుకోవాలి. ఇవన్నీ చక్కగా సరైన రీతిలో చేసుకోవాలి. ఈ విధమైన రీతిగా మనము పాలనము చేసినప్పుడే హృదయము కూడను perfect గా వుండటానికి వీలవుతుంది. ఏ ఒక్క చిన్నదాని యందు తారతమ్యము వుండకూడదు. అప్పుడే క్రమశిక్షణ అలవడుతుంది. కాని యీనాడు క్రమశిక్షణ కోల్పోటానికి కారణం యేమంటే సమయపాలన మనలో లోపించింది.

విద్యార్థులారా! కేవలము యీనాడు విద్యావిధానమనేది ఒకవిధమైన పెడమార్గము పడుతూ వస్తుండాది. ఈ విద్యలో చైతన్యముగాని, నైపుణ్యముగాని యేమాత్రము కనుపించటము లేదు. ఏదో బుక్కులు కంఠస్థము గావించుకోటము, కంఠస్థము గావించుకున్న విషయాలలో మనం మార్కులు తెప్పించుకోటం, డిగ్రీలు పొందటము యింతమాత్రమే జరుగుతున్నది. కృషి కూటి కోసం. విద్య విజ్ఞానము కోసం. కాని దురదృష్టవశాత్తూ యీనాడు education కూటి కోసము వున్నట్లుగా భావిస్తున్నాము. మన విద్య జీవితము కోసము. అన్నము కోసము కాదు. ఈనాటి విద్యార్థులందరు కూడను తమయొక్క మానసికతత్వాన్ని చాలా పెడమార్గము పట్టించుకుంటున్నారు. ఒక విద్యార్థి mathematics లో చాలా clever గా వుంటాడు. దానిని చక్కగా పోషించటానికి అధిపతులు కొంతవరకు, teachers కొంతవరకు ప్రోత్సహించాలి. విద్యార్థి కూడ దానిని అనుసరించుతూ పోవాలి. ఆ విధముగా ఒక్కొక్క subject లోపల ఒక్కొక్కనికి అభిరుచి ఏ విధముగా వున్నదో ఆ అభిరుచిని పురస్కరించుకొని ఆ subject ను develop చేసుకుంటూ పోవాలి. ఈనాడు యీ commerce, యీ science, యీ bio science వీటి ద్వారా నా భవిష్యత్తులో ఏ ఉద్యోగము చిక్కుతుంది, ఎంత సంపాదిస్తాను అని మొట్టమొదటనే సంపాదనకు ఉద్యోగమునకు ప్లాన్లు వేస్తారు. కనుక దీనిని బట్టి మనము చూస్తే జీవనోపాధికి చదువుతున్నారేగాని జీవితం యొక్క పరమావధికి వారు చదువుకోటంలేదు. మంచి జీతము సంపాదించాలి. ఏమిటి యీ జీతములు జీతములు.. watchman కూడ జీతము తీసుకుంటాడు. బస్సు conductor జీతము తీసుకుంటాడు. ఏమిటి యీ జీతము. జీవితమనే జీతము మనము సంపాయించాలి. విజ్ఞానందమును పొందటానికి ప్రయత్నించాలి గాని విషయానందము కోసము గాదు.

విద్య అనేది శరీరమునకు, మనస్సుకు, ఆత్మకు సంబంధించినదిగా వుండాలి. ఏ విధముగా ఆత్మతత్వమనేది అంతర్ముఖమునందు, బహిర్ముఖమునందు సంచరిస్తూ వున్నదో అదేవిధముగనే విద్యకూడను సర్వవ్యాపిగా సంచరించాలి. అదే constant

523068810

integrated awareness దానిని మనము పోషించాలి. ఇది నిజమైన విద్య. ఏదో ప్రపంచ విషయములంతా తలకు చేర్చుకొని తలకు భారముగా చేసుకొని ఏ blood pressure లేక paralysis వచ్చి పడిపోటం కాదు. ఇవన్ని కూడను బహిర్గతమైన నాగరికతను మాత్రమే పోషింపచేస్తున్నది. కాని అంతరమైన నాగరికతను కూడను మనము అభివృద్ధి పరచుకోవాలి. అదే ప్రధానమైనది. పునాదులు భద్రముగా లేకపోతే ఎంత భవనములు కట్టినా ఏమి ప్రయోజనము. కనుక లోపల వుండిన మానసిక తత్వము, ఆయొక్క పవిత్రతను మనము బలపరచుకోటానికి ప్రయత్నించాలి. అప్పుడు బహిర్ముఖమైన ఆనందమును అనుభవించవచ్చును. ఈ బహిర్ముఖమైనది మనకు అవసరమైనప్పటికి దీనికి ఆధారమైన అంతర్ముఖమును మనము పోషించుకోవాలి. అదియే హృదయ పరిపాకము, హృదయ విశాలము, హృదయనిర్మలము. అదే నిజమైన మన స్వేచ్ఛ. స్వేచ్ఛ అనగా యిష్టము వచ్చినట్లుంతా బజార్లు చుట్టటం కాదు. నీకు తోచిన పనులన్నీ చేయటం కాదు స్వేచ్ఛ. ఆత్మనిగ్రహము, ఆత్మానందము, ఆత్మజ్ఞానము యీ మూడింటి సమ్మిళితమైనదే స్వేచ్ఛ. కానీ యీనాడు యీస్వేచ్ఛకు అనేక విధములైన అర్థములు చెప్పుకుంటూ మానవుడు కేవలము కుక్కలకంటె హీనముగా ప్రవర్తిస్తున్నాడు. కాదు కాదు మనవిద్యార్థులు ఒక్కొక్క దేశమునకు, ఒక్కొక్క గృహమునకు, ఒక్కొక్క బజారునకు ఒక street lamp మాదిరి వుండాలి. ఆదర్శమును అందించే విద్యార్థులుగా తయారు కావాలి.

విద్యార్థులారా! యీనాడు నూతన విద్యార్థులు ప్రవేశించారు. మన విద్యాసంస్థ యొక్క నిబంధనలు, మన విద్యాసంస్థ యొక్క నియమములు కొంతవరకు గుర్తించుకొని వర్తించటానికి ప్రయత్నించాలి. కేవలము అన్ని విద్యాసంస్థల వలె కాకుండా, యీ విద్యాసంస్థయందు ప్రత్యేకమైన లౌకిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సంబంధమైన మార్గములన్నియు అందించేటువంటిది. ఈ వాతావరణమునకు తగిన రీతిగా మీరు ప్రవర్తించటానికి పూనుకోవాలి. మీరు యీ నూతన ప్రదేశములో ప్రవేశించినవారు, దీనిని సమన్వయము గావించుకొని, సంరక్షించుకొని ఉత్తేజమైన నూతన భావములలో మీరు ప్రవేశించాలి. అందరియందు సోదరభావము పెంచుకోవాలి. ఇది మనయొక్క గృహముగా విశ్వసించాలి. హాస్టలు వుంటుండాది. హాస్టలు నిజముగా మనయొక్క వసతి గృహము. ఇది నాయిల్లు. నాయింటిలో యే విధమైన పెడమార్గములు పట్టకూడదు. నాయింటి పరిస్థితి యేమాత్రము చెడపకూడదు. నీ విద్యపూర్తి అయ్యేంత వరకే కాకుండా నీ జీవితమనేది యీ విద్యాలయముగా భావించుకోవాలి. డిగ్రీ నీకు అంత్యము కావచ్చుగాని జీవితము అంత్యమయ్యేంత వరకు యీ శిక్షణ వుంటుండాలి. కనుక discipline చాలా అవసరము. ఆ discipline లేకపోతే మనయొక్క జీవితమే వ్యర్థమై పోతుంది.

విద్యార్థులారా! యిక్కడయీ యొక్క పరిస్థితిని మీరు మొట్టమొదట అర్థము చేసుకోటానికి ప్రయత్నించండి. ఏదో ప్రవేశించటానికి పూర్వము అనేక ఉత్సాహములతో యిక్కడకు రావచ్చును. కాని యిక్కడ వున్న క్రమశిక్షణలలో మధ్యమధ్య కొంతవరకు మ

523068811

మనస్సు చలించవచ్చును. పూర్వము నీవు తొమ్మిదిగంటలకు, పదిగంటలకు నిద్రనుండి లేస్తూ వుండవచ్చును. కానీ మన హాస్టల్ లో నాలుగు గంటలకు లేవాలి. చల్లని నీళ్ళ స్నానము చేయాలి. sports లో గాని, యింకొక దానిలో గాని, అన్నింటిలో పాల్గొనాలి. ప్రతి విషయమునందు attend కావాలి. మన రూములు మనమే శుభ్రపరచుకోవాలి. మన పాత్రలు మనము శుభ్రపరచుకోవాలి. మనము వున్న స్థానాన్ని మనము పరిశుద్ధము చేసుకోవాలి. ఇవన్నీ భవిష్యత్తునకు ప్రధానమైనవి. అప్పుడే awareness in life. అన్నీ తెలుసుకోటమే మన జీవితము. ఏదో ఒక Subject లోనే పోవటము యింకో Subject విమర్శించటము యిది narrow mind అయిపోతుంది. అన్నింటియందు కొంత పరిచయము చేసుకోవాలి. అంతేకాకుండా అందరివ్యక్తులతో మంచిగా జీవించాలి. ఏ విధముగా ఒకరితో ఒకరికి భేదాభిప్రాయములు వచ్చినా కూడను మనము పోట్లాడుటకు యేమాత్రము పూనుకోకూడదు. ఈ విధమైన సహన భావమును మనము పెంచుకోవాలి.

విద్యార్థులారా! కేవలము చెప్పటమే కాకుండా చేసి నిరూపించే మార్గములో మనము ప్రవేశించాలి. ఇక్కడ అన్నింటికిని ఆధ్యాత్మికము చాలా ఆధారము. ఆత్మవిశ్వాసము ప్రతి మానవునికి అత్యవసరము. అది లేక దేనిలో కూడను మన జీవితము రాణింప చేసుకోలేము. ఈ విధమైన విశ్వాసము మనము బలపరచుకోవాలి. ముఖ్యముగా MBA Boys. నేను పూర్వము చెప్పినట్లుగా సత్సంపత్తిని మీరు అభివృద్ధి పరచుకోవాలి. ఇంద్రియనిగ్రహము. చెడ్డను చూడకుండా, చెడ్డను వినకుండా, చెడ్డను మాట్లాడకుండా, చెడ్డను తలవకుండా, చెడ్డను చేయకుండా చూచుకోవాలి. కారణమేమనగా యీ యింద్రియ నిగ్రహమే లేకుంటే యీ MBA Boys అనేక factories లోకి పోతుంటారు, industries లోకి పోతుంటారు అక్కడ management లో ప్రవేశిస్తూ వుంటారు. ఈ విధముగా యింద్రియ నిగ్రహమే లేకుండాపోతే బంకులలో దెబ్బలు తినవలసి వస్తుంది. నీ నాలుకను నీవు చాలా భద్రములో పెట్టుకోవాలి లేకపోతే చక్కని మాపాట్ జరుగుతుంది. ఇది బాగా మీరు MBA boys గుర్తించాలి. ఏదో నేను మేనేజరుగా పోతాను, నేను ఒక Aircondition room లో కూర్చుంటాను, లేబర్ ను అంతా కంట్రోలు చేస్తాను, ఎట్లా కంట్రోల్ చేస్తావు. నీ యింద్రియములనే నీవు కంట్రోలు చేయని వాడవు లేబర్ ను ఎలా కంట్రోలు చేయగలవు. మొట్టమొదట నిన్ను నీవు కంట్రోలు పెట్టుకున్న నాడే యింకొకరిని కంట్రోలు చేయటానికి అధికారివి అవుతావు. కనుక మన జీవితములో భవిష్యత్తును యీనాడు లక్ష్యములో పెట్టుకోవాలి. దీనికి పారమార్థికము అత్యవసరము. దైవవిశ్వాసము చాలా అవసరము. ఈ మూడింటి యొక్క తత్వమును మనము గుర్తించాలి.

దైవప్రీతి, పాపభీతి, సంఘనీతి యివే మనము పోషించుకోవాలి. ఈ మూడు వుండినప్పుడే సరైన ఆదర్శమును నిరూపించగలవు. విద్యార్థులారా! అధిక ప్రసంగములలో మనము ప్రవేశించకూడదు. ఈ నాడు మాటలలో మనము గొప్పగా ప్రదర్శించుకుంటున్నాము గాని క్రియలలో యేమాత్రము నిరూపించటంలేదు. నాకు కావలసినది మాటలు లేని హృదయము

523068812

ఈనాడు హృదయములేని మాటలు మనకు అక్కర లేదు. ఎక్కడకు వెళ్ళినప్పటికి చెడ్డనే చూడటానికి ప్రయత్నిస్తున్నాము. కాదు. కాదు మంచిని చూడటానికి ప్రయత్నించాలి. మంచి ఫలపుష్పములలో సుగంధమును వెదజల్లే నందనవనములో ప్రవేశించి కూడను పంది మలము కోసము తిరుగుతూ వుంటుంది. కానీ ఫలాన్ని ఆశించదు. ఎక్కడ. నందనవనములో కూడను. ఆవిధముగా యీపవిత్రమైన ప్రదేశములోకి వచ్చి చెడ్డనే ఎందుకు వెదకటానికి ప్రయత్నించాలి. మంచిని నీవు వెతకనక్కరలేదు. యిక్కడ కావలసినంత లభిస్తుంది. కనుక మంచిని మీరు పొందండి. ఇక్కడకు వచ్చినందుకు మీ తల్లి తండ్రులకు తగిన ఆనందమును అందించండి. అదే కృతజ్ఞత. మాతృదేవోభవ. పితృదేవోభవ. యీరెండింటి తరువాతనే గురుదేవోభవ. మన గురువునకు తగిన కృతజ్ఞతను యివ్వాలి. కాని చాలామంది పిల్లలు గురువుకు తగిన respect యివ్వటములేదు. అది చాలా తప్పు. ఒక్కటి మాత్రము మీరు చక్కగా గుర్తించాలి. ఈనాటి పౌరులు, యీనాటి అధికారులు, వీరందరు ఎవరు పూర్వము వారందరు మొన్నటి విద్యార్థులే. ఈనాటి విద్యార్థులే రేపటి దినము పౌరులు, రేపటి దినము అధికారులుగా కాబోతారు. కనుక యీనాడు పౌరులకు, అధికారులకు ఏవిధమైన respect మనము అందిస్తామో రేపటి దినము అలాంటి respect ను అందుకోటానికి సిద్ధముగా వుంటాము. ఈనాడు పెద్దలకు యేవిధమైన respect నీవు యివ్వకపోతే నీకు యితరులు యేవిధముగా అందిస్తారు. విద్యార్థులారా! యిది కేవలము one way traffic కాదు give and take ఇచ్చిపుచ్చుకునే తత్వము. ఈవిధమైన పవిత్రమైన నడతలు చదువుకంటే మన గుణములు చాలా గొప్పవి. చదువు రాకపోయినా తప్పులేదు. గుణములు మాత్రము చదువుకోసం విసర్జించరాదు. కనుక మనకు గుణము వుంటుంటే లోకములో యెక్కడైనా స్థానము వుంటుంది. గుణము లేక యెంత విద్యవుండినప్పటికి యేవిధముగా గౌరవము పొందలేము. అయితే రెండూ వుండుటవల్ల మరింత అభివృద్ధి గావించవచ్చు. కనుక మన విద్యాసంస్థలోపల పవిత్రమైన మానవతావిలువలు మనము అభివృద్ధి పరచుకోవాలి. ఈ మానవత్వము పోషించుకోటానికి యీసమయములో అన్నిరంగములలో మనము ప్రవేశించి, పదిమందితో కలసి మెలసి ప్రేమతత్వాన్ని, సహనతత్వాన్ని, సానుభూతిని పెంచుకోటానికి పూనుకోవాలి.